14032025-MAI-04_Layout 1 3/14/2025 3:34 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

పాక్‌లో ఉగ్రదాడి

ఉగ్రవాద భూతాన్ని పెంచి పోషించి, ఎగుమతి చేసిన దేశంగా పాకిస్థాన్ అపఖ్యాతి మూటగట్టుకున్నది. ఇప్పుడు అదే ఉగ్రవాదం కోరల్లో చిక్కుకొని పాకిస్థాన్ విలవిలలాడుతున్నది. బలూచ్ వేర్పాటువాదులు ఏకంగా ఓ రైలునే హైజాక్ చేసి పాక్ పాలకులకు భారీ సవాల్ విసిరారు. సాయుధ బలగాల దాడిలో ఉగ్రవాదులు హతులైనప్పటికీ పెద్ద సంఖ్యలో అమాయకులైన బందీలు మరణించడం బాధాకరం. 30 గంటలపాటు జరిగిన హోరాహోరీ పోరు తర్వాత 300 మందికి పైగా ప్రయాణికులను విడిపించినట్టు పాక్ సైనిక ప్రతినిధి వెల్లడించారు. అనేకమంది ప్రయాణికులు అమరులైనట్టు బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్టీ ప్రకటించారు. చనిపోయిన ప్రయాణికుల్లో సెలవుపై వెళ్తున్న సైనికులు ఎక్కువమంది ఉండటం గమనార్హం.

పాకిస్థాన్ నైరుతి ప్రాంతంలో ఉండే బలూచిస్థాన్ పాక్‌లోని అతిపెద్ద రాష్ట్రం. అతి తక్కువ జనాభా ఉండే ఆ రాష్ట్రం కొండలు గుట్టలతో దుర్గమంగా ఉంటుంది. అయితే ఖనిజ వనరులు మాత్రం అక్కడ విస్తారంగా ఉన్నాయి. చాగీ జిల్లాలో రెండుచోట్ల బంగారు, రాగి నిల్వలు దండిగా ఉన్నాయి. సుసంపన్నమైన తమ వనరులపై పాక్ ప్రభుత్వం పెత్తనాన్ని సహించని బలూచీలు మొదటి నుంచీ స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నారు. దేశ విభజన సమయంలో పాక్ నాయకత్వం, ముఖ్యంగా దేశ వ్యవస్థాపకుడు ముహమ్మద్ అలీ జిన్నా స్వాతంత్ర్యాన్ని ఎంచుకున్న బలూచీల మెడలు వంచి మరీ విలీనం చేసుకున్నది. తమ వనరులపై పెత్తనం సాగిస్తున్న పాక్ ప్రభుత్వం తమ అభివృద్ధి గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే భావన బలూచీల్లో బలంగా ఉన్నది. 1970 దశకంలో పాక్ నుంచి బంగ్లాదేశ్ విడివడటంతో బలూచీల్లో వేర్పాటువాదం మరింత బలంగా వేళ్లూనుకున్నది. అందులో నుంచే బీఎల్ఏ, బీఎల్ఎఫ్ (బలూచ్ లిబరేషన్ ఫ్రంట్) వంటి సాయుధ సంస్థలు ఆవిర్భవించాయి. రెండు దశాబ్దాలుగా ఉగ్రదాడులతో విరుచుకుపడుతున్నాయి. పాక్ సైన్యాన్ని, పౌరులను అవి హతమారుస్తున్నాయి. పాక్.. చైనాతో చేతులు కలిపి తమ వనరులను తరలించుకుపోతున్నారని, అందులో తమకు ఎలాంటి లబ్ధి కలుగడం లేదని బలూచీలు విమర్శిస్తుంటారు.

చైనా తన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ) ప్రాజెక్టులో భాగంగా బలూచిస్థాన్‌లో పలు ఓడరేవులు, రోడ్డు మార్గాలు, ఇతర మౌలిక నిర్మాణాలకు భారీగా నిధులు సమకూర్చింది. ఇవి చైనాకు సరుకుల రాకపోకలను సులభతరం చేసేందుకు చేపట్టినవేనన్నది తెలిసిందే. ఈ కారణంగానే ఖనిజాల అన్వేషణ, సేకరణ వంటి వాణిజ్య కార్యకలాపాల నిమిత్తం వచ్చే చైనా పౌరుల పైనా బీఎల్ఏ దాడులకు తెగబడుతున్నది. తరచుగా రైళ్లను లక్ష్యం చేసుకోవడం బీఎల్ఏ ప్రత్యేకత. పొరుగున ఉన్న ఇరాన్‌లోనూ కొంత బలూచీ ప్రాంతం ఉన్నది. అక్కడ కూడా అప్పుడప్పుడూ వేర్పాటువాద దాడులు జరుగుతుంటాయి. బలూచిస్థాన్‌కు స్వాతంత్ర్యం ఇవ్వడమంటే పాకిస్థాన్‌కు ఆత్మహత్యా సదృశమే. ఎందుకంటే విశాలమైన భూభాగంతో పాటుగా వనరులపై ఆధిపత్యం అది కోల్పోవాల్సి ఉంటుంది. కనీసం ప్రజాభీష్టం మేరకు స్వయంప్రతిపత్తి కల్పించి బలూచీలకు తమ వనరులకు తామే యజమానులమన్న భావన ఏర్పడటానికి వీలు కల్పించాలి. అప్పుడే బలూచ్ సమస్యకు తెరపడుతుందని పాక్ నాయకత్వం గుర్తించాలి.

మాకొద్దీ బూతుల పాలన!

ఈ మధ్య జాతీయ కాంగ్రెస్ పార్టీ ఒక కొత్త విధానం ప్రకటించింది. దేశంలోని 7-14 ఏండ్ల బాలబాలికల కోసం 'జవహర్ బాల మంచ్'ను స్థాపించింది. మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, ప్రియాంకాగాంధీ, పవన్‌కుమార్ బన్సల్, కృష్ణ అల్లవరు ఈ సంస్థ పోషకులు అని వారి వెబ్ సైట్‌లోనే రాసుకున్నరు. బాలల ప్రేమికుడు, భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్ఫూర్తితో దేశంలోని బాలబాలికలను మంచి పౌరులుగా తీర్చిదిద్దే సంకల్పం చెప్పుకున్నది ఆ సంస్థ.

శ్రీశైల్‌రెడ్డి పంజుగుల
90309 97371

రేవంత్‌రెడ్డి రక్షకుడు అయిన రాహుల్‌గాంధీకి సూటి ప్రశ్న. నిన్న ఉద్యోగుల సభలో నీచంగా మాట్లాడినట్టే, ఆ మధ్య స్కూలు పిల్లల మీటింగ్‌లోనూ రేవంత్‌రెడ్డి ఇదే భాష ఉపయోగించారు. దీనిని 'జవహర్ బాల మంచ్' ఆదర్శంగా తీసుకోగలదా? బాలలకు రేవంత్ మార్కు చదువు చెప్పగలదా? రేవంత్ మోడల్‌ను దేశవ్యాప్తం చేయగలదా? బాల మంచ్ ప్రస్తుత జాతీయ చైర్మన్ డాక్టర్ జీవీ హరిని తీసేసి ఆ స్థానాన్ని రేవంత్‌రెడ్డికి రాహుల్ ఇవ్వగలరా? లేదు కదా? మరి మా తెలంగాణకు ఎందుకు?

> **'నేను సీఎం కావాలని అనుకున్న. అయిన. బస్'.. ఈ మాట రేవంత్‌రెడ్డి ఎన్నోసార్లు చెప్పారో. పదే పదే పబ్లిక్‌గా చెప్పడానికి ఆయన తెగ ఉత్సాహం చూపుతరు. సీఎం పదవి అంటే ఆయనకు జీవన సాఫల్య పురస్కారం లాంటిది మరి. ఆ పదవి కోసం ఆయన తెంపిన గట్లు, తిట్టిన తిట్లు, దిగజారిన మెట్లు లెక్కకు మించి!**

సింహంలా కావాలనుకునే ముందు ఎలుకలు తినే అలవాటును పిల్లి మానేయాలని ఆఫ్రికన్ సామెత. 'గమ్యం ఎంత ముఖ్యమో.. మార్గమూ అంతే ముఖ్యం' అన్న మహాత్మాగాంధీ మాటలు రాహుల్‌గాంధీ ప్రియ శిష్యుడికి ఎక్కవు. రేవంత్‌రెడ్డికి చదివే, వినే, నేర్చుకునే అలవాటు లేదు. ఎంతోమంది మేధావులు షేర్పాల్లా తెలిసో తెలియకో సాయం చేయడం వల్లే రేవంత్ ఈ రోజు రాజకీయ ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కగలిగారు. ఇప్పుడు ఆయన కాళ్ల కింద మంచు కరగడం ప్రారంభమైంది. భర్తృహరి చెప్పిన 'ఆకాశంబున నుండి... పాతాళం వరకూ' పడిపోయే వివేక భ్రష్టత మూటగట్టుకుంటున్నరు. అప్రతిష్ఠ పోగుచేసుకొనేందుకు ఓవర్ టైమ్ పనిచేస్తున్నరు. తన సలహాదారులు, మంత్రులు, అధికారులు ఎవరినీ రేవంత్ నమ్మడం లేదు. ఈయనను వారూ నమ్మడం లేదు. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును రాహుల్‌గాంధీ సందేహాస్పదంగా చూస్తున్నరు. మీనాక్షీ నటరాజన్ టీకాంగ్రెస్ వాకిలిలో 'కొంచెం ఇష్టం, కొంచెం కష్టం' లాగా.. ఒకోసారి అభిమానంగా, మరోసారి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నారు. ఏది ఏమైనా తెలంగాణ పరిస్థితి దేశం ముందు హాస్యాస్పదంగా మారింది. రేవంత్ తనే స్వయంగా బహిరంగ వేదికల మీద ఒప్పుకుంటున్నట్టు అలవిమాలిన అబద్ధపు హామీలు నేరవేర్చే పరిస్థితి లేదు. 'నాతో అయితలేదు, మీరే పాలించండి' అంటూ ఉద్యోగుల దగ్గర బేలగా, పీలగా మాట్లాడిన్రు. 'ఎవరూ నా మాట వినడం లేదు' అంటూ ఆక్రోశం వెళ్లగక్కుతున్నరు. తన మంత్రివర్గ సహచరులు, కేంద్ర రక్షణశాఖ మంత్రి సైతం సీఎం పేరు మరిచిపోతున్నరు. వారు, వీరని తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి వర్గమూ నిరసనలతో హోరెత్తిస్తున్నది. ప్రస్తుత తెలంగాణ పరిస్థితిని 1985 లోనే డాక్టర్ సి.నారాయణరెడ్డి ఇలా ఊహించారు.

> **సుజల విమల కీర్తనలో సుఫలాశయవర్తనలో**
> **జలంలేక బలంలేక జనంఎండుతున్నది**
> **మలయజశీతల పదకోమల భావన బాగున్నా**
> **కంటికంటిలో తెలియని మంటరగులుతున్నది**
> **సస్యశ్యామల విభవస్తవ గీతాలాపనలో**
> **పైరు నోచుకోని బీళ్లు నోళ్లు తెరుస్తున్నవి**
> **పుల్లకుసుమిత ద్రుమదళవల్లికామతల్లికలకూ**
> **చిదిమివేసినా వదలని చీడ అంటుకున్నది**

దీనంతటికీ కారణం ఒకే ఒక్క రేవంత్‌రెడ్డి. పాలనను మూలకు పడేసి, ప్రజాధనం కుటుంబానికి దోచిపెట్టే నవీన మార్గాల అన్వేషణలో నిరంతరం మునిగి తేలుతూ, విమర్శకులపై దుష్ట భాషణలతో విరుచుకుపడుతూ చరిత్ర పుటల్లో శాశ్వత అపకీర్తి పేజీలు రాసుకుంటున్నరు తన కోసం. ఆ ఫ్రస్ట్రేషన్ నుంచి సాంత్వన కోసం వేదిక ఏదైనా విచక్షణ కూడా లేకుండా, సమాజం హర్షించదన్న స్పృహ లేకుండా విషంగక్కుతున్నరు. ఉద్యోగుల నియామక పత్రాల అందజేత సమయంలో తెలంగాణ రాష్ట్ర సాధకుని మరణం కోరుకున్న జీవి రేవంత్‌రెడ్డి.

> **శ్రీకృష్ణుడు పుట్టినప్పటి నుంచీ అంతా ఆయన చావును కోరుకున్న వారే. ఆయన మీద జరిగినన్ని హత్యా ప్రయత్నాలు విశ్వంలో ఎక్కడా ఎప్పుడూ ఎవరి మీదా జరగలేదు. అన్నీ దాటి ఆయన జగద్గురువు అయినాడంటే కారణం సత్యసంధత, రుజువర్తన. ప్రపంచానికి ఆయన మాత్రమే ఇవ్వగలిగిన రాజకీయ, తాత్విక దార్శనికత. మంచిని మంచని, చెడును చెడు అనే సాహసం కేసీఆర్‌లో ఉన్నాయి. ఆయన నిండు నూరేళ్లూ మన మధ్య ఉంటరు. అది సామాజికావసరం.**

రాహుల్‌గాంధీ పుట్టుక గురించి అసోం ముఖ్యమంత్రి హేమంత బిశ్వశర్మ నీచంగా మాట్లాడితే తీవ్రంగా నిరసించిన మహోన్నతుడు కేసీఆర్. సొంత పార్టీ ఎంపీ శశిథరూర్‌ను గాడిద అని రేవంత్ తూలనాడితే ఖండించిన విలువలున్న నాయకత్వం బీఆర్ఎస్‌ది. రాజకీయాల్లో విమర్శలోతుగా, సాధికారికంగాఉండాలి. అసహ్యంగా, అసభ్యంగా కాదు. అసెంబ్లీలో దూషణలకు పాల్పడొద్దని, ఆధారాలతో ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడాలని తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఉద్బోధ చేసిన సంస్కారి కేసీఆర్. అలాంటి మహా నాయకుడిపై రేవంత్ వదరుబోతు తనాన్ని రాహుల్ సహించినా తెలంగాణ క్షమించదు. ఈ మొత్తం వ్యవహారంలో తరతమ భేదాలు లేకుండా తెలంగాణ సమాజమంతా రేవంత్‌ను ఏకిపారేస్తున్నది. జాతీయ స్థాయి కాంగ్రెస్ నాయకులు ఒకరు నాతో మాట్లాడి రేవంత్ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర క్యాబినెట్ మంత్రి ఒకరు ఈయన నుంచి మాకు విముక్తి ఎపుడో అని సామాజిక మాధ్యమాల్లో ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు తెలంగాణ దీవెనలు పుష్కలంగా ఉన్నయి. ఆయనకు ఏమీ కాదు. ఫీనిక్స్‌లా ఎగిసివస్తరు. మీ పార్టీని మార్చురీ దారి నుంచి తప్పించండి. ఇప్పటికే రాజకీయ నాయకులు అంటేనే వెగటు భావనతో ఉన కొత్తతరం పూర్తిగా ఆశలు కోల్పోకముందే రేవంత్‌ను గద్దెదింపి పరువు కాపాడుకోవాలని రాహుల్‌గాంధీకి విజ్ఞప్తి. మీరు చెప్పుకున్న లక్ష్యాలను మీరైనా గౌరవించండి. అద్దం ముందు నిలబడి ఒకసారి ఆత్మావలోకనం చేసుకోండి! లేకపోతే చెడేది మీరే!

గౌరవ శాసనసభకు విన్నపం

హోంగార్డుల వెతలు తీరేదెన్నడు?

> **హోంగార్డులు.. 'అటెండర్‌కు ఎక్కువ.. పోలీసుకు తక్కువ'. ఉదయం డ్యూటీ ఎక్కితే ఎప్పుడు ఇంటికొస్తాడో తెలియదు. రోజంతా వెట్టి చాకిరి. 'ఏయ్.. చాయ్ తీస్కరా పో..' అనే హూంకారంతో వారి దినచర్య మొదలవుతుంది. 'ఇంటికి వెళ్తా సార్' అంటే.. 'అప్పుడేనా.. లంచ్ బాక్స్ కడిగి కార్‌లో పెట్టు' అనే వరకూ ఎన్ని పనులు చేస్తుంటారో, ఎన్నెన్ని పనులు చేయించుకుంటారో ఆ నాలుగు గోడలకే ఎరుక. అంత వెట్టిచాకిరి చేస్తున్నా ఈ చిరు ఉద్యోగులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది.**

చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న హోంగార్డులను పట్టించుకున్న దిక్కు లేదు. ప్రభుత్వం ఇలా మారిందో లేదో.. అలా ఇబ్బందుల కొలిమిలో మాడిపోతున్నారు. హోంగార్డులు. ప్రభుత్వం మారిన దగ్గర్నుంచి వేతనాలు సరిగా రాక ఇబ్బందులు పడుతున్నారు. జీతం కోసం ఒక్కోసారి 20వ తేదీ వరకు ఎదురుచూడాల్సి వస్తున్నది. చెక్‌బౌన్స్‌లకుతోడు, ఈఎంఐ డేట్‌లు ముగిసిపోయి సిబిల్ స్కోర్ పడిపోతున్నది. దీనికి తోడు పిల్లల స్కూల్ ఫీజులు, ఇంట్లో ఖర్చులు, కిరాణా సరుకులు, పాల డబ్బులు, ఇంటి అద్దెలు, బండికి పెట్రోల్ వంటి వాటికి డబ్బులు సర్దడం చాలా కష్టంగా మారుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 వేల మంది హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నా ప్రభుత్వం వారి సంక్షేమానికి పాటుపడకపోవడం విడ్డూరం. ఈ నేపథ్యంలో కొందరు హోంగార్డులు ఆర్థిక ఇబ్బందులు తాళలేక తనువు చాలించడం బాధాకరం.

> **ఎన్నికల వేళ హోంగార్డులను పర్మనెంట్ చేస్తానని హామీ ఇచ్చిన నాటి పీసీసీ అధ్యక్షుడు, నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హోంగార్డులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. ప్రజావాణిలో మంత్రి సీతక్కకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ప్రతి రోజూ గంటల తరబడి గొడ్డుచాకిరి చేస్తున్న హోంగార్డులపై పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వం కనికరం చూపడం లేదు. ఇతర రాష్ట్రాల్లో బందోబస్తు విధులకు హాజరైన హోంగార్డులకు ఇచ్చే డైలీ డ్యూటీ అలవెన్స్‌లు, డైట్ చార్జీలు కట్ చేసి మా పొట్టకొడుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. ఒక్క తెలంగాణ మినహా ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల డ్యూటీకి హోంగార్డులు వెళ్తే.. డైలీ డ్యూటీ అలవెన్సులను వారి వేతనంతో కలిపి ప్రోత్సాహకాలుగా ఇస్తున్నారు. ఇక్కడ మాత్రం కోతలు పెడుతున్నారు.**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే హోంగార్డులకు కారుణ్య నియామకాలు రద్దు చేసి పెద్ద షాక్ ఇచ్చింది. 600 మందికి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు ఇవ్వబోమని చెప్పడం మరింత దుర్మార్గం. వెల్ఫేర్ ఫండ్ కింద రూ.20 తీసుకుంటున్నా వాటిని ఎక్కడ వాడుతున్నారో? ఎలా వాడుతున్నారో తెలియదు. ఇటీవల సంభవించిన వరదలకు మాత్రం కనీస సమాచారం లేకుండానే హోంగార్డుల వేతన నుంచి ఒకరోజు జీతాన్ని కట్ చేశారు. అయితే, ఎవరైనా హోంగార్డు చనిపోతే ఆదుకుంటామని ఒకరోజు జీతం ఇస్తామని ముందుకొస్తే మాత్రం అలాంటి అవకాశం లేకుండా చేస్తున్నారు. ఇద్దరు కమాండెంట్‌లు, ఒక అడిషనల్ డీజీ ర్యాంకు అధికారి ఉన్నా మాకు ఎలాంటి న్యాయం జరగడం లేదు. కమాండెంట్ ఆఫీసుల్లో, ఏడీజీ ఆఫీసుల్లో ఏండ్లపాటు పాతుకుపోయిన వారు.. క్షేత్రస్థాయిలో హోంగార్డుల సమస్యలను పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుకుంటున్నారు. జిల్లాల్లో హోంగార్డుల సమస్యలపై దర్బార్ ఏర్పాటు చేయడమో, హెల్త్ క్యాంపులు పెట్టడమో, హోంగార్డుల పిల్లల చదువులకు ఏమైనా సాయం చేయడమో వంటి వాటిని అస్సలు పట్టించుకోవడం లేదు.

విన్నపాలివీ..

- గత ఎన్నికల ప్రచారంలో భాగంగా హోంగార్డులకు హెల్త్‌కార్డులు ఇస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం తక్షణం హోంగార్డులందరికీ ఎలాంటి నిబంధనలు పెట్టకుండా హెల్త్‌కార్డులు ఇవ్వాలి.
- ప్రతినెలా ఒకటో తేదీన వేతనం ఇవ్వాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో కలిపి రూ.5 లక్షలు ఇవ్వాలి.
- కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి. ఇందుకోసం 600 మందికిపైగా హోంగార్డులు ఎదురు చూస్తున్నారు.
- ఐదేండ్లుగా ఉన్న పెండింగ్ అలవెన్స్ తక్షణం విడుదల చేయాలి. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లను మినహాయిస్తే.. జిల్లాల్లో ఉన్న సుమారు 6వేల మందికి పైగా హోంగార్డులకు ఒక్కొక్కరికి సుమారు రూ.37,500 అలవెన్స్ రావాలి.
- ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు ఎలాంటి షరతులు, నిబంధనలు లేకుండా ఇందిరమ్మ ఇండ్లు/డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ఇవ్వాలి.
- ఆర్డర్లి వ్యవస్థను తక్షణం రద్దు చేయాలి. ఇప్పటికే రిటైర్డ్ అయిన ఐపీఎస్ అధికారుల ఇండ్లలో హోంగార్డులతో సేవలు చేయించుకుంటున్నారు. తెలంగాణ పోలీసు అకాడమీలో మరీ దారుణంగా మున్సిపల్ వర్క్స్ చేసే అన్ని పనులూ హోంగార్డులతో చేయిస్తున్నారు. దాన్ని ఆపాలి.
- కిట్ ఆర్టికల్స్ అయిన క్యాప్, బెల్ట్, విజిల్‌కార్డ్, సాక్సులు, స్వెట్టర్‌ను హోంగార్డులకు ఇవ్వాలి.
- ఏపీలో ఇచ్చిన విధంగా రెండ్రోజులు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలి. ఎవరైనా హోంగార్డు చనిపోతే అతని కుటుంబంలో ఒకరికి నెలలోపు ఉద్యోగం ఇవ్వాలి.
- బందోబస్తుకు వెళ్తే డైట్‌చార్జీలు ఇవ్వాలి. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో కొనసాగించినట్టే జిల్లాల్లోనూ హోంగార్డుల పిల్లల చదువులకు ఇబ్బంది లేకుండా 3-4 ఏండ్లు ఒకేచోట పనిచేసుకునే వెసులుబాటు కల్పించాలి.
- 30 రోజులకు ఒక్కో స్టేషన్‌కు మార్చడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. అదర్ డిపార్ట్‌మెంట్స్ (ఓడీ)లలో పనిచేసే హోంగార్డులను పట్టించుకోకపోవడం వల్ల ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారు.
- నేటికీ 600 మంది డ్యూటీలు లేక పస్తుంటున్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలి.

ఎస్‌కే సైదులు
రిటైర్డ్ హోంగార్డుల సంఘం అధ్యక్షుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా

బీసీలకు దక్కిన అపురూప కానుక

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీల నామినేషన్ల ఘట్టం ముగిసింది. తెలంగాణలోని 5 స్థానాలకు గాను కాంగ్రెస్ మూడింటికి, ఒక్కో స్థానానికి సీపీఐ, బీఆర్ఎస్ తమ అభ్యర్థులను నిలబెట్టాయి. 21మంది ఎమ్మెల్యేల బలముంటే ఒక స్థానం గెలిచే అవకాశం ఉంటుంది. కాబట్టి పార్టీల తరపున నిలబడిన అభ్యర్థులు అందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సాధారణంగా ఇలాంటి సందర్భాల్లో కనీసం సగం స్థానాలైనా అగ్రకులాలవారికి వెళుతుంటాయి. ఈసారి మాత్రం అన్ని స్థానాలు కింది కులాల వారికి దక్కడం ఓ విశేషమే. కావాలనే పార్టీలు ఇలా ఎంపిక చేశాయా? లేక సమీకరణాలు ఇలా కుదిరాయా? అనేది పార్టీ పెద్దలకే తెలుసు.

బద్రినర్సన్
9440128169

కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపికైన అభ్యర్థుల్లో అద్దంకి దయాకర్ మినహా మిగతా ఇద్దరి పేర్లు ఎవరూ ఊహించనివే. కనీసం సీఎం రేవంత్‌రెడ్డికి కూడా చివరి నిమిషం వరకు తెలియక పోవచ్చు. శంకర్‌నాయక్, విజయశాంతి పేర్లు సీల్డ్ కవర్‌లో ఢిల్లీ నుంచి వచ్చినట్టు చెప్పుకుంటున్నారు. రేవంత్ తన సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డికి ఎమ్మెల్సీ సీటు ఇప్పించుకోలేక పోయారు. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి కూడా సంగారెడ్డికి చెందిన కాంగ్రెస్ నాయకుడి కోసం రాష్ట్ర మంత్రులతో సిఫారసు చేసినా ఫలితం దక్క లేదు. కాంగ్రెస్ జాతీ య కమిటీ నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలిగా మీనాక్షి నటరాజన్ ముద్ర ఈ ఎంపికపై కనబడిందని చెప్పవచ్చు. పైకి సోనియా, రాహుల్ పేర్లు రేవంత్‌రెడ్డి జపించినా పాలనలో తానే సర్వస్వం అని భావిస్తూ ముందుకు సాగుతున్నారు. తన తప్పిదాలు కప్పిపుచ్చుకొనే క్రమంలో ఆయన తెలంగాణ సాధించిన పార్టీని, నేతలను తక్కువ చేస్తూ మాట్లాడడం ఎక్కువైంది. మరోవైపు హామీల వైఫల్యాల వల్ల ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ క్రమంగా కోల్పోతున్నది. దీనిని సవరించే దిశగా, రేవంత్‌ను కట్టడి చేయాలనే ఉద్దేశంతోనే అధిష్ఠానం ఇంచార్జిని మార్చి ఉండవచ్చు. దీర్ఘకాలంగా పార్టీలో కొనసాగుతున్న వారి జాబితా కావాలని మీనాక్షి నటరాజన్ తొలి సందర్శనలోనే కోరారు. దాని ప్రభావంగానే గ్రామస్థాయి నుంచి పార్టీకి పనిచేసిన శంకర్ నాయక్ ఇప్పుడు ఎమ్మెల్సీ అయ్యారు.

ఈసారి ఎమ్మెల్సీల్లో పార్టీలకు అతీతంగా అందరూ అంగీకరించే పేర్లు రెండు ఉన్నాయి. అందులో ఒకటి అద్దంకి దయాకర్ కాగా, మరోటి దాసోజు శ్రవణ్. ఒకరు దళిత బిడ్డ, మరొకరు బీసీల ప్రతినిధి. కుల వెనుకబాటుతప్ప ఇద్దరిలో సామర్థ్యపరంగా ఎలాంటి లోటు లేదు. బీఆర్ఎస్ తరపున నామినేషన్ వేసిన దాసోజు శ్రవణ్ విద్యార్థి దశ నుంచి నాయకుడిగా కొనసాగుతున్నారు. 1987లో ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ప్రధాన కార్యదర్శిగా గెలిచారు. టెక్ మహీంద్రా లాంటి దిగ్గజ కంపెనీల్లో హెచ్ఆర్, జీఎం స్థాయిలో పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనేందుకు ఉద్యోగాలను వదిలేశారు. ఉద్యమకారుడిగా తెలంగాణ సాధనలో కష్టనష్టాలను అనుభవించారు.జస్టిస్ శ్రీకృష్ణ కమిటీకి సమర్పించిన చారిత్రక నివేదికలను రాయడంలో ఆయన కేసీఆర్, ప్రొఫెసర్ జయశంకర్‌ల వెంటఉన్నారు. ఉద్యమ సమయంలో కేంద్రానికి సమర్పించిన తెలంగాణ పారిశ్రామికీకరణ ముసాయిదా రూపకల్పనలో కేటీఆర్‌కు సహకరించారు.

2008లో ప్రజారాజ్యం పార్టీతో క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చిన శ్రవణ్ 2009లో సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి పీఆర్పీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో ప్రజారాజ్యం పార్టీ వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవడంతో ఆ పార్టీని వీడి తెలంగాణ ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీలో స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా తెలంగాణ ఉద్యమంలో అనేక టీవీ చర్చల్లో తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించారు.

ఒక వెనుకబడిన తరగతికి చెందిన వ్యక్తి రాజకీయంగా ఎదగడానికి ఎన్ని అడ్డంకులు ఎదుర్కోవాలో తెలుసుకోవడానికి దాసోజు ప్రస్థానమే ఉదాహరణ. ఎన్నికల్లో టికెట్ వచ్చినా ఖర్చుకు తట్టుకోలేక ఓటమి పాలుకాక తప్పలేదు. 2023, ఆగస్టులో బీఆర్ఎస్ ఆయనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా సిఫారసు చేసినా నాటి గవర్నర్ తమిళిసై కుదరదన్నారు. రాజ్‌భవన్, ప్రగతిభవన్ రగడలో ఇలా ఆయన బలయ్యారు. ఎస్సీ, ఎస్టీల మాదిరి బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు లేవు. జనాభాలో సగమైనా అసెంబ్లీ, పార్లమెంటులో వీరి సంఖ్య తక్కువ. బీసీలందరికీ ఒకే రకమైన ఆర్థిక స్తోమత లేదు. ఈ నేపథ్యంలో విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన దాసోజు శ్రవణ్ విధాన మండలికి వెళ్లడం బీసీలందరికీ ఆనందదాయకం. పార్టీలకతీతంగా ఆయనకు, ఈ హోదా అందించిన బీఆర్ఎస్‌కు అభినందనలు, ధన్యవాదాలు.

కేసీఆర్.. తెలంగాణ స్పార్టకస్

అవును
ఆయన స్టైచర్ మీద ఉన్న తెలంగాణ
వాదానికి ఊపిరి పోసి రాష్ట్రాన్ని డెలివరీ
చేసినవాడు
అవును
ఆయన మార్చులికి మర్లుతున్న రైతుల
జీవితాల్ని మార్చడానికి భగీరథ తపస్సు
చేసినవాడు
వలస పాలకుల చేతిలో జీవచ్ఛవంలా
ఉన్న తెలంగాణకు జీవం పోసినోడు
నీళ్లు లేక నెర్రలు బారిన ఈ నేలకు కృష్ణా,
గోదావరి జలాలతో దూప తీర్చినోడు
అన్నం మెతుకు దొరకని తెలంగాణను
అన్నపూర్ణగా మార్చినోడు
షాకులు ఇచ్చే కరెంటును సరిచేసి 24
గంటలు వెలుగులు విరజిమ్మేలా చేసినోడు
బక్క పలచని మనిషైనా
ఉక్కు గుండె గలవాడు
తెర్లయిన తెలంగాణ బతుకులకు
తెరచాపై గమ్యం చూపినవాడు
స్టేచర్ ఉత్తగనే రాదు
ప్రజలే ప్రాణం అనుకుంటే వస్తది
మంది మీద పొద్దుపోతే రాదు,
మనసు పెట్టి పని చేస్తే వస్తది
ఆయన ఎన్నడూ నీలాగా
పదవుల కోసం పలవరించలే...
గడ్డిపోస లెక్క పదవుల్ని విసిరేసి
తెలంగాణను గెలిచి
ప్రజల హృదయాలో కొలువైనాడు
స్ట్రెచర్ మీద ఉన్న తెలంగాణకు ఆయన
జీవగంజి పోసి బతికిస్తే,
నువ్వు అదే తెలంగాణను
మార్చులికి పంపే ప్రయత్నం చేస్తున్నవ్
కేసీఆర్ తెలంగాణ పతారా పెంచి
ప్రపంచంతో పోటీపడి పనిచేస్తే
నువ్వు చౌకబారు మాటలతో
చేతకాక దివాలా తీయిస్తున్నవ్
నీలాంటి అల్పులు ఎంత గీపెట్టినా
ఆయన వెరవడు
వెయ్యి ఏనుగుల బలాన్ని
కూడదీసుకొని మళ్లీ వస్తాడు
నిన్నూ, నిన్ను ఆడిస్తున్న వాళ్ల ఆట కట్టిస్తాడు
తిరిగి తెలంగాణను నిలబెట్టి గెలిపిస్తాడు
ఎక్కడ ఉన్నా ఆయన కేసీఆర్
తెలంగాణ